
## భూమికి పచ్చని రంగేసినట్టు



ఎత్తంగట్టు సమీపం గంట్రావుపల్లి శివారులో వరిచేను చిత్రమిది. కింద భూమికి పచ్చని రంగేసినట్లు, ఆకాశం నీలి మబ్బులతో ఇలా కనువిందు చేసింది. మంగళవారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, కొల్లాపూర్ గ్రామీణం

# ప్రాజెక్టు పనుల్లో జాప్యం

### పరిహారం తదితర సమస్యలతో ముందుకు సాగని పాలమూరు-రంగారెడ్డి పథకం



నార్లాపూర్ జలాశయం నుంచి ఉన్న కాల్వలో నిలిచిన నీళ్లు



సున్నపుతండా వద్ద హెడ్ రెగ్యులేటరీ ప్రాంతంలో అసంపూర్తిగా కాల్వ పనులు

**కొల్లాపూర్, న్యూస్‌టుడే :** లక్షలాది ఎకరాలకు సాగునీరు, వేలాది గ్రామాలకు తాగునీరు అందించడానికి రూ.వేల కోట్ల వ్యయంతో చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో జాప్యం ఏర్పడుతోంది. నిర్వాసితులకు పరిహారం, తదితర సమస్యలు దీనికి కారణం. దీంతో ఏటా లక్ష్యం మేర నీటి ఎత్తిపోత జరగడంలేదు. ఈసారి కృష్ణానదికి వరద జలాలు భారీగా వచ్చినా వాడుకోలేని పరిస్థితి నెలకొంది.

**అసంపూర్తి పనులు...**

ఈ పథకంలో భాగంగా కొల్లాపూర్ మండలంలో చేపట్టిన నిర్మాణ పనుల్లో సాంకేతిక సమస్యలు తీరడం లేదు. నార్లాపూర్ జలాశయంలో 2 టీఎంసీల నీటి నిల్వ చేశారు. భారీగా వర్షపు నీళ్లు చేరడంతో జలాశయం నుంచి సున్నపుతండా వైపు కాల్వలో నీళ్లు నిలిచాయి. ఇక్కడ రహదారిపై అడ్డుకట్ట తొలగించలేదు. హెడ్ రెగ్యులేటరీ ప్రాంతంలో కాల్వ పనులు పూర్తి కాలేదు. మరోవైపు నేటికీ సున్నపుతండా నిర్వాసితులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లకపోవడంతో సమస్య తలెత్తుతోంది. జీవోలు 120, 123 ప్రకారం పరిహారం చెల్లించడం, ఇందులో వేర్వేరుగా నిబంధనలు ఉండడంతో నిర్వాసితులు మెరుగైన పరిహారానికి డిమాండ్ చేస్తున్నారు.

● ప్యాకేజీ-3లో చేపట్టిన కాల్వల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తిర్నాంపల్లి, కుడికిల్ల శివారుల్లో వంతెన పనులతో పాటు కాల్వ పనులు పూర్తిచేయాల్సి ఉంది. ఇక్కడ కూడా నిర్వాసితులకు పరిహారం చెల్లించలేదు. ప్రధాన పనులు పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది జలాశయాలను నింపే పరిస్థితి లేదు. మరోవైపు నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివేన తదితర జలాశయాల పనులు పూర్తి కావొస్తున్నాయి. పనులు పూర్తి చేసి శ్రీశైలం వరద జలాలతో ఈ సారైనా జలాశయాలను నింపితే భూగర్భ జలాలు పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా పరిహారం చెల్లింపు, పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలంటూ రైతులు, నిర్వాసితులు కోరుతున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

# నిర్వహణ లేక నీరందక!

### తరచుగా తెగుతున్న కేఎల్ఐ బ్రాంచి కాల్వ



ముత్తిరెడ్డిపల్లి వద్ద పాటు కాల్వపై ఉన్న యూటీ ఎక్కి కేఎల్ఐ కాల్వలోకి పారుతున్న వర్షపు నీరు

**కోడేరు, కొల్లాపూర్, న్యూస్‌టుడే :** మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేస్తున్నారు. పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వపై నుంచి పాటు కాల్వలు ఉన్నాయి. వర్షపు నీరు పోవడానికి పాటుకాల్వలపై యూటీలు నిర్మాణం చేశారు. భారీ వర్షాలు వస్తే యూటీ ఎక్కిపారి కేఎల్ఐ కాల్వలోకి నీరు ప్రవహిస్తోంది. కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేయక, కాల్వ గట్టు తక్కువగా ఉండటం, పాటుకాల్వపై ఉన్న యూటీల నుంచి వర్షపు నీరు ఎక్కి పారుతుండటంతో తరచుగా తెగిపోతున్నాయి.

**సామర్థ్యం 30 వేలు.. సాగు 60 వేలు :** ఏటా రెండు పంటలకు సాగునీరు ఇచ్చే కేఎల్ఐ బ్రాంచి కాల్వకు వర్షపు నీటిగండం పట్టుకుంది. కేఎల్ఐలోని పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ, ఉప కాల్వల పరిధిలో 30 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. జొన్నలబొగుడ జలాశయం, గుడిపల్లి జలాశయానికి ఉన్న ప్రధాన కాల్వకు మూడో కిలో మీటర్ వద్ద పసుపుల - పాన్‌గల్ బ్రాంచి కాల్వ ఏర్పాటైంది. ఈ కాల్వ నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలోని కోడేరు, పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లోని కొన్ని గ్రామాల పంటలకు సాగునీరు అందిస్తుంది. మొత్తం 33 కిలో మీటర్ల పొడవున ఉండగా కోడేరు మండలంలో 12 వేల ఎకరాలు, పాన్‌గల్ మండలంలో 13 వేలు, వీపనగండ్లలో సుమారు 2 వేల నుంచి 5 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. అయిదేళ్లుగా మూడు మండలాల్లో మొక్కసారిగా ఆయకట్టు 50 వేల నుంచి 60 వేల ఎకరాలకు సాగు పెరిగింది. ఉప కాల్వల చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**లైనింగ్ లేకపోవడంతోనే..:** పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వకు మొదటి నుంచి సిమెంట్ లైనింగ్ పనులు చేయలేదు. 33 కిలో మీటర్ల పొడవునా గత ప్రభుత్వ హయాంలో 2023లో సిమెంట్ లైనింగ్ పనులకు రూ. 60 కోట్లతో శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి నేటి వరకు పనులకు టెండర్లు పిలవలేదు. సెప్టెంబరులో దాదాపుగా 20 రోజులు కురిసిన భారీ వర్షాలకు ముత్తిరెడ్డిపల్లి, రాజాపూర్ శివారుల్లో బ్రాంచి కాల్వ తెగిపోయే పరిస్థితి నెలకొనడంతో అధికారులే కాల్వకు గండి పెట్టి వాగులకు వరద నీటిని వదిలారు. తెగకుండా చర్యలు చేపట్టారు. కోడేరు, పెద్దకొత్తపల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉన్న ఉప కాల్వలు ఎక్కడపడితే అక్కడ తెగిపోయాయి. మరి కొన్ని కాల్వల్లో జమ్ముగడ్డి, కంపచెట్లు పెరిగాయి.

**నిధులు కేటాయిస్తేనే..**

పసుపుల-పాన్‌గల్ బ్రాంచి కాల్వ మరమ్మతులకు నిధులు లేవు. జమ్ము గడ్డి, పూడిక తీత, కాల్వ గట్టు పెంచడం, కోతలు పడితే మరమ్మతులు, కంపచెట్లు తొలగింపునకు బ్రాంచి, పిల్ల కాల్వల సర్వే చేశాం. రూ. 40 లక్షలతో అంచనాలు వేసి ప్రభుత్వానికి పంపించాం. నిధులు వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తాం.

- రవీందర్, ఈఈ, కేఎల్ఐ, నాగర్‌కర్నూల్

## 11 నుంచి పబ్బతి అంజన్న బ్రహ్మోత్సవాలు

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** నల్లమల ప్రాంతంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచించారు. డిసెంబరు 11 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను మంగళవారం అచ్చంపేట క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ రాములు నాయక్, పాలకమండలి సభ్యులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలి : జూపల్లి




మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు, వేదికపైన ఎంపీ డా. మల్లురవి, కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు

**కందనూలు, న్యూస్‌టుడే :** విద్యా నైపుణ్యంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి కృషి చేయాలని రాష్ట్ర అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పట్టణంలో మంగళవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై పార్లమెంట్ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించగా మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ కల్పన కోసం సొంత నిధులు నుంచి రూ. 50 లక్షలు కేటాయించి నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలో రూ. 150 కోట్లతో నాగర్‌కర్నూల్‌లో రుణమేళా నిర్వహిస్తామన్నారు. యువకులు పోలీసు ఉద్యోగంలో రాణించడానికి ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎంపీ డా. మల్లురవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ యువతకు ఇప్పటి వరకు 50 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. అచ్చంపేట, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి ఎమ్మెల్యేలు డా. వంశీకృష్ణ, డా. కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువకులు బ్యాంకు రాయితీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడారు. సమావేశంలో డీసీసీబీ ఛైర్మన్ మావిళ్లపల్లి విష్ణువర్దన్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వివిధ జిల్లాల అదనపు కలెక్టర్లు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# నగదు తీసుకో.. వేలిముద్ర వేసిపో!





### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో ఇదే దందా

న్యూస్‌టుడే, మహబూబ్‌నగర్ గ్రామీణం

ఇప్పుడు రేషన్ దుకాణాల్లో ఉచితంగానే బియ్యం పంపిణీ చేస్తున్నారు. బియ్యం తప్ప ఏ ఇతర సరకులు పంపిణీ చేయటం లేదు. ఈ లెక్కన రేషన్ డీలర్ దగ్గర డబ్బులే ఉండొద్దు. కానీ ఏ రేషన్ దుకాణానికి వెళ్లినా డీలర్ ముందట డబ్బులు పట్టుకుని సిద్ధంగా ఉంటున్నారు. రేషన్ దుకాణాలకు వచ్చే లబ్ధిదారులను ఏమాత్రం సంకోచం లేకుండా బియ్యం ఇస్తారా అని నేరుగా అడుగుతున్నారు. వేలిముద్ర వేయించుకుని వారికి బియ్యం కాకుండా డబ్బులు ఇచ్చి పంపిస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యం రేషన్ దుకాణం నుంచి నేరుగా రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. ఇదంతా తెలిసినా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఒక్కరినీ పట్టుకున్న దాఖలా లేదంటే ఉమ్మడి జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.



దుకాణాన్ని సీజ్ చేయకుండా తాళం వేసిన అధికారులు



ఖిల్లాగణపురంలో పట్టుకున్న బియ్యం మహబూబ్‌నగర్ పట్టణం రవీంద్రనగర్‌లోని ఈ రేషన్ దుకాణానివే

**పట్టుకుంటున్నది పోలీసులే :** ఉమ్మడి జిల్లాలో 2,024 రేషన్ దుకాణాలు ఉన్నాయి. 89,95,931 రేషన్ కార్డుల్లోని లబ్ధిదారులకు ప్రతినెలా 1,59,386 క్వింటాళ్ల బియ్యం కేటాయిస్తున్నారు. సగం కుటుంబాలు కూడా ఇంటికి బియ్యం తీసుకోవటం లేదు. భారీ మొత్తంలో బియ్యం రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. ఈ నెల 14న ఖిల్లాగణపురం మండల శివారులోని ఓ రైస్‌మిల్లు వద్ద వాహనంలో ఇద్దరు వ్యక్తులు 19 క్వింటాళ్ల ఉచిత బియ్యం తరలిస్తూ సీసీఎస్ పోలీసులకు చిక్కారు. వారిని ఆరా తీస్తే మహబూబ్‌నగర్‌లోని రేషన్ దుకాణం నుంచి బియ్యం తీసుకొచ్చినట్లు చెప్పారు. ఈ సమాచారంతో అధికారులు మహబూబ్‌నగర్ పట్టణంలోని వీరన్నపేట, రవీంద్రనగర్, కిసాన్‌నగర్ ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. బోర్డు కూడా లేకుండా రవీంద్రనగర్‌లోని చిన్న సందులో నిర్వహిస్తున్న 5వ నంబరు రేషన్ దుకాణం నుంచి బియ్యం తరలించినట్లు గుర్తించి ఆ డీలర్‌పై కేసు నమోదు చేశారు. 17న మానవపాడు మండలం నుంచి 23 క్వింటాళ్ల బియ్యం ఆటోలో పెబ్బేరులోని రైస్‌మిల్లుకు తరలిస్తుండగా సీసీఎఫ్ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఇలా రోజూ ఎక్కడో ఒకచోట బియ్యం అక్రమ రవాణా జరుగుతుంటే పోలీసులు పట్టుకుంటున్నారే తప్పా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవటం లేదు. అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు తెలియజేస్తే పట్టుకోవడం సంగతి అటుంచి వారు డీలర్లకే సమాచారం ఇచ్చి అప్రమత్తం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ అపనమ్మకంతోనే జనం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలకు కాకుండా సీసీఎఫ్ పోలీసులకే సమాచారం ఇస్తున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోలీసులు బియ్యం పట్టుకుని నమోదు చేసిన కేసులే ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిఘా

**దుకాణాలపై నిఘా ఏదీ? :** రేషన్ దుకాణాల నుంచి ఉచిత బియ్యం తీసుకెళ్లే వినియోగదారుల ఇళ్ల వద్దకు డీలర్ల ప్రతినిధులు వెళ్లి కిలో రూ.10 నుంచి రూ. 15 చొప్పున ధర చెల్లించి బియ్యం సేకరించేవారు. ఆ బియ్యం ఆటోల్లో రైసుమిల్లులకు చేరవేసేవారు. ఇప్పుడు పంథా పూర్తిగా మార్చేశారు. లబ్ధిదారులతో వేలిముద్రలు వేయించుకుని రేషన్ దుకాణంలోనే బియ్యం కొనేస్తున్నారు. ఆ బియ్యం ఏరోజుకారోజు రాత్రి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో 84 రేషన్ దుకాణాలు ఉండగా ప్రతినెలా 11,370 క్వింటాళ్ల బియ్యం సరఫరా అవుతాయి. లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని డీలర్లు దాదాపు సగం బియ్యం పక్కదారి పట్టిస్తున్నారు. అన్ని మండలాల్లోనూ ఇదే జరుగుతోంది. ప్రతి నెలా 28వ తేదీ నుంచే బియ్యం కోటా గోదాం నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా అవుతుంది. 1వ తేదీ నుంచి పంపిణీ చేస్తారు. దుకాణానికి బియ్యం చేరిన రోజు నుంచే నిఘా పెట్టాల్సి ఉన్నా ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు పట్టించుకోవట్లేదు.

## లోపించిన నాణ్యత.. ఏడాదిలోపే క్షీణత



విద్యానగర్‌లో రాళ్లు తేలుతున్న సీసీ దారి

**కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే :** ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు గుత్తేదారుల నిర్లక్ష్యం వల్ల నాసిరకంగా తయారవుతున్నాయి. నిబంధనలు పాటించేలా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఏడాదిలోపే నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. కల్వకుర్తి పురపాలికలో గతేడాది సుమారు రూ.40 కోట్ల మిషన్ భగీరథ నిధులతో సీసీ దారులు నిర్మించారు. అందులో నామమాత్రంగా ఇసుక, నాణ్యత లేని సిమెంట్‌ను వాడి, ఎక్కువగా రాతిపిండి(డస్ట్) వినియోగించడం వల్ల అనేక చోట్ల రాళ్లు తేలుతున్నాయి. ఇంకో సంవత్సరం అయితే పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉంది.

**ప్రస్తుత పనులు నాణ్యతగా చేపట్టాలి...**

కల్వకుర్తి పురపాలికలోని సీసీ దారులు, మురుగు కాల్వల నిర్మాణాలకు టీయూఎఫ్ఐడీసీ నుంచి సుమారు రూ.10 కోట్లు మంజూరు అయ్యాయి. ఈ పనులకు పది రోజుల క్రితం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. 22 వార్డుల్లో 11 కిలోమీటర్ల సీసీ దారి, 1.5 కి.మీ మురుగుకాల్వల నిర్మాణం చేపట్టనున్నారు. గుత్తేదారు ఇప్పటికే పలు వార్డుల్లో పనులు మొదలు పెట్టాడు. అయితే నిర్మాణంలో ఇసుక, రాతిపిండి సమపాళ్లు ఉపయోగించి 53 గ్రేడ్ సిమెంట్‌ను వాడాలని ఒప్పందంలో ఉంది. ఇవి పాటించేలా చూడాల్సిన బాధ్యత అధికారులది. ఈసారైన పనులు నాణ్యతగా చేపట్టేలా అధికారులు, పాలకులు దృష్టిసారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పుర ఏఈ షబీర్‌ను వివరణ కోరగా.. 100శాతం నిబంధనల ప్రకారమే నిర్మాణాలు చేపట్టామని చెప్పారు. క్షేత్రస్థాయిలో గుత్తేదారుకు సూచనలు చేస్తున్నామని తెలిపారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

## వీఆర్‌కు లింగాల ఎస్సై

**లింగాల, న్యూస్‌టుడే :** క్రమశిక్షణ చర్యల్లో భాగంగా లింగాల ఎస్సై జగన్‌మోహన్‌పై ఉన్నతాధికారులు మంగళవారం వేటు వేశారు. ఈ నెల 13న పెట్రోల్ బంక్‌లో గొడవ జరగగా.. ముగ్గురు యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి శిరోముండనం చేసిన విషయం తెలిసిందే. అందులో ఓ యువకుడు మనస్తాపం చెంది ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు జోగులాంబ గద్వాల డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ ఉత్తర్వుల ప్రకారం ఎస్సైని వనపర్తి ఎస్పీ కార్యాలయం వీఆర్‌కు అటాచ్ చేశారని అచ్చంపేట సీఐ రవీందర్ తెలిపారు.

# ఈ సారీ.. భరోసా లేదు మరి!



**కొత్తకోట, నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే:** రైతులకు ఒకే విడతలో రూ.2 లక్షలు రుణమాఫీ చేసిన ప్రభుత్వం వానాకాలం పంటలకు రైతుభరోసా ఇచ్చి తీరుతుందని గట్టి నమ్మకం ఉండేది. ఆ నమ్మకంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నీళ్లు చల్లేశారు. జులైలో రైతుల సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాల్ని తీసుకున్నప్పటికీ 'రైతు భరోసా' ఎవరికి ఇవ్వాలన్న దానిపై ప్రభుత్వానికి స్పష్టత రాకపోవడంతో వానాకాలం పంటలకు రైతుభరోసా ఇవ్వడం లేదంటూ మంత్రి స్పష్టం చేయడంతో రైతులకు నిరాశే మిగిలింది.

**ఆరేళ్లుగా సాయం..:** రైతులకు పెట్టుబడి సాయం అందించి వారిలో ఉత్సాహం నింపి సాగును క్రమంగా పెంచవచ్చని, పెట్టుబడి కోసం అప్పులు చేయరాదని భారాస హయాంలో రైతుబంధు పథకాన్ని ప్రకటించింది. 2018 మేలో తొలిసారి పెట్టుబడి సాయాన్ని విడుదల చేశారు. తొలి ఏడాది వానాకాలం, యాసంగి పంటలకు కలిపి రెండు విడతల్లో రూ.4 వేల చొప్పున ఎకరాకు రూ.8 వేలు అందజేయగా తర్వాత ఏడాది నుంచి ఏటా రెండు విడతల్లో మొత్తం రూ.10 వేలు అందజేస్తూ వచ్చారు. ఇలా క్రమం తప్పకుండా ఆరేళ్ల పథకాన్ని అమలు చేశారు. గత డిసెంబర్‌లో అందాల్సిన యాసంగి రైతుబంధు ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోగా వాటిని ఈ ఏడాది జులైలో విడుదల చేశారు. ఇదే పథకాన్ని 'రైతు భరోసా' పేరుతో ఏడాదికి రెండు విడతల్లో రూ. 7,500 చొప్పున రూ.15 వేలు అందజేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం నిధుల్ని దుర్వినియోగం చేస్తూ వ్యవసాయదారులకే కాకుండా స్థిరాస్తి వ్యాపారులకు, గుట్టలకు పుట్టలకు వీటిని అందజేసిందని, నిజమైన రైతుల కంటే బడాబాబులే ఎక్కువ లబ్ధి పొందారని వారిని ఏరి పారేసి రైతులకు భరోసా అందజేస్తామంది. ఈ క్రమంలో జూన్‌లోనే పలు జిల్లాల్లో అభిప్రాయ సేకరణ చేపట్టారు. అయినా మంత్రి వర్గ ఉపసంఘంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రైతు భరోసాకు వానాకాలం నిధులకు బ్రేక్ పడింది. యాసంగి నుంచి అమలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది.

**తెరచుకోని పోర్టల్ :** మరోవైపు రైతుభరోసా నమోదు చేసుకునే అవకాశం కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు దక్కించుకున్న రైతులు జూన్ నాటికి రాష్ట్ర వ్యవసాయ శాఖ పోర్టల్‌కు సీసీఎల్ఏ(చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్) నుంచి దస్త్రాలు బదిలీ కావాల్సి ఉంటుంది. జూన్ తర్వాత ఈ పోర్టల్ తెరచుకోలేదని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే పలు దఫాలుగా రైతుబంధును కోల్పోగా వచ్చే సీజన్ నాటికైనా రైతుభరోసాను అందుకోవాలని ఆశిస్తున్నారు.



● రైతుభరోసా అందుతుందని ఎంతో ఆశ పడ్డాం. పెట్టుబడి సాయం అందుతుందని ప్రైవేటులో వడ్డీలకు తెచ్చుకున్నాం. ఇప్పుడు సాయం దక్కకపోవడంతో పంటలపై వాటిని కట్టే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం వెంటనే యాసంగి పంటల భరోసానైనా విడుదల చేసి రైతులకు అండగా నిలవాలి.

- జలంధర్‌రెడ్డి, కొత్తకోట

**ఉమ్మడి జిల్లాలో గత యాసంగి ఇదీ పరిస్థితి..**

| జిల్లా | లబ్ధిదారులు | ఎకరాలు | నిధులు(రూ.కోట్లలో) |
|---|---|---|---|
| మహబూబ్‌నగర్ | 1,90935 | 4,44,853 | 222.40 |
| నాగర్‌కర్నూల్ | 2,68,363 | 7,30.311 | 365.14 |
| వనపర్తి | 1,52,513 | 3,58,848 | 179.42 |
| జోగులాంబ గద్వాల | 1,51,963 | 4,47,427 | 223.69 |
| నారాయణపేట | 1,55,511 | 4,47,252 | 223.62 |

## రాష్ట్రస్థాయి పోటీలకు నలుగురు విద్యార్థులు



వరప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

**అచ్చంపేట టౌన్, అమ్రాబాద్, లింగాల, న్యూస్‌టుడే :** అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలోని వాలీబాల్ అకాడమీకి చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు శివకుమార్ తెలిపారు. అండర్-19 విభాగంలో ఎం.ప్రవీణ్, వై.శ్రీకాంత్, అండర్-17 విభాగంలో ఇ.వరప్రసాద్, ఆర్.సిద్ధు ఇటీవల జరిగిన ఎస్జీఎఫ్ జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటినట్లు చెప్పారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ వీరిని శాలువాతో సత్కరించి అభినందించారు. ప్రిన్సిపల్ అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● లింగాల గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వరప్రసాద్ రాష్ట్రస్థాయికి ఎంపికవడం అభినందనీయమని పీడీ వెంకటేశ్వర్లు అన్నారు. ఈనెల 27, 28, 29వ తేదీల్లో పెద్దపల్లిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

## ఉమామహేశ్వర క్షేత్రంలో బాలబ్రహ్మ పీఠాధిపతి పూజలు



ఆభరణాలను పరిశీలిస్తున్న ధర్మకర్తల మండలి బృందం, అధికారులు

**అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే :** నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీ ఉమామహేశ్వర క్షేత్రంలో నిత్య అన్నదానానికి ముషీరాబాద్ (హైదరాబాద్)కు చెందిన అరుణమ్మ, రాజ్‌కుమార్ దంపతులు రూ.25 వేల విరాళం అందజేశారు. వైష్ణవి, విజయభాస్కర్‌రావు దంపతులు అమ్మవారికి రూ.12 వేలు విలువైన బంగారు ముక్కు పుడక అందించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకులం జిల్లాకు చెందిన బాలబ్రహ్మ పీఠాధిపతి క్షేత్రాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యమని దేవస్థాన ఛైర్మన్ మాధవరెడ్డి ఈ సందర్భంగా అన్నారు. మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవో శ్రీనివాస్‌రావు, ఎమ్మెల్యే సతీమణి అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

# పరిహారం.. స్వాహాపర్వం

**గద్వాల పట్టణ ఠాణాలో కేసు నమోదు**

**గద్వాల అర్బన్, న్యూస్‌టుడే:** జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి చేతివాటం ప్రదర్శించి అడ్డంగా దొరికిపోయాడు. మోసాన్ని నేరుగా న్యాయమూర్తి గుర్తించడంతో పలు మోసాలు వెలుగు చూశాయి. విశ్వసనీయ సమాచారం మేరకు.. జిల్లాలోని పలు ప్రాజెక్టులకు సంబంధించి ముంపు భూమి బాధితులు పరిహారం పొందారు. పరిహారం న్యాయస్థానం ద్వారా బాధితులు తీసుకున్నారు. బాధితులు తీసుకున్న పరిహారం తాలూకా న్యాయస్థానం రిజిస్టర్లలో రికార్డు అయి ఉన్నాయి. అయితే బాధితుల పేరిట గుట్టుచప్పుడు కాకుండా రెండోసారి పరిహారం పొందేందుకు(డబుల్ క్లెయిమ్) న్యాయస్థానంలో పని చేసే ఓ అధికారి కొందరి సహకారంతో స్కెచ్ వేశాడు. అందులో భాగంగా ఇది వరకే పరిహారం పొందిన వారి పేరిట ఉన్న వివరాలను వైట్నర్ ద్వారా సరి చేసి వేరే వ్యక్తి పేరిట రెండో సారి పరిహారం పొందేందుకు ప్రయత్నించాడు. ఇలా పలు విడతల్లో సుమారు 2016 నుంచి 2021 వరకు అధికారికంగా రూ. 3.08 కోట్లు తన పేరిట, తన భార్య పేరిట డిపాజిట్ చేశారు. అయితే ఈ వ్యవహారం రూ.4 కోట్లకు పైగా ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.. ప్రాజెక్టుల నిర్మాణంలో ముంపునకు గురయ్యే భూములను కోల్పోయిన బాధితుల రికార్డులను న్యాయమూర్తి పరిశీలించే క్రమంలో రూ. 52,45,850 విలువ చెక్కు 2021లో ఓ మహిళకు జారీచేయగా, అదే మొత్తంలో పరిహారం పొందిన ఓ వ్యక్తి పేరుపై వైట్నర్(ట్యాంపర్డ్) చేసినట్టు గుర్తించి అక్రమాలు చోటు చేసుకున్నట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ క్రమంలో రికార్డులను, కంప్యూటర్ డాటాను లోతుగా విచారించడంతో సదరు అధికారి పలు విడతల్లో అక్రమాలకు పాల్పడినట్టు కనుగొని షోకాజ్ నోటీసు జారీ చేశారు. విషయాన్ని హైకోర్టు దృష్టికి న్యాయమూర్తి తీసుకెళ్లారు. హైకోర్టు ఆదేశానుసారం రెండు రోజులుగా ఉన్నత స్థాయి అధికారులు లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. న్యాయస్థాన సీనియర్ పర్యవేక్షకురాలు ఫిర్యాదు మేరకు సోమవారం గద్వాల పట్టణ ఠాణాలో అక్రమాలకు పాల్పడిన అధికారి, అతడి భార్యపై కేసు నమోదైనట్టు గద్వాల డీఎస్పీ సత్యనారాయణ తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామని, ముంపు పరిహారం రెండోసారి పొందేందుకు ప్రయత్నించిన ఘటనపై గద్వాల సీఐ టంగుటూరి శ్రీను విచారణాధికారిగా వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

**ప్రస్తుతానికి గుర్తించిన రెండోసారి పరిహారం జమ వివరాలు**


| తేది | నగదు (రూ.) |
|---|---|
| 23.12.2016 | 3,35,000 |
| 18.02.2017 | 8,68,227 |
| 29.04.2017 | 8,22,180 |
| 23.11.2017 | 21,66,026 |
| 16.03.2018 | 33,03,117 |
| 20.05.2019 | 69,47,120 |
| 17.12.2019 | 85,46,420 |
| 09.04.2021 | 52,45,850 |
| 16.08.2021 | 25,98,250 |

# తపాలా.. పడిలేచిన కెరటంలా

**వినియోగదారుల ఆకర్షణకు కొత్త పథకాలు**

**న్యూస్‌టుడే, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి:** పడిలేచిన కెరటంలా తపాలా శాఖ కొత్తపుంతలు తొక్కుతూ, నూతన పథకాల అమలుతో పునరుజ్జీవం పొందుతోంది. ఒకప్పుడు తపాలా అంటే కేవలం ఉత్తరాలు బట్వాడాకే పరిమితం. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ కొత్త పథకాలతో ప్రజల్లోకి వెళ్తూ ఆదరణ పొందుతోంది. దేశంలోని ఏ ప్రాంతానికైనా పార్సిళ్లు పంపే సౌకర్యం నేడు ఖండాంతరానికి వ్యాపింపజేసింది. కొన్ని ప్రైవేట్ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. కమ్యూనికేషన్ విభాగంలో ప్రైవేటు కొరియర్ సంస్థలు హవా నడుస్తున్న తరుణంలో తపాలా శాఖ మూసధోరణికి స్వస్తి పలికింది. పేదలు, మధ్యతరగతి ప్రజలకు పొదుపు పథకాలతోపాటు, ఇతర సేవలు అందిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. దీనిలో భాగంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా తపాలా వారోత్సవాలు జరుపుతూ ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా అధికారి సృజన్ నాయక్ తెలిపారు. మేళాలు నిర్వహించి కుటుంబానికంతటికీ ఉపయోగపడే కొత్తపథకాలను ఈనెల 7 నుంచి వారం పాటు పరిచయం చేసినట్లు పేర్కొన్నారు.

**జవసత్వాలు.. :** 170ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న తపాలా శాఖ పడిలేచిన కెరటంలా నూతనోత్తేజంతో ముందుకు సాగుతోంది. ప్రైవేటు ఈ-కామర్స్ సంస్థలతో పోటీపడుతూనే బ్యాంకు సేవలు కూడా అందించేందుకు తపాలా బ్యాంకుగా అవతరించి సేవలు అందిస్తోంది.





బిజినేపల్లి మండలం మహాదేవునిపేటలో బాధితులకు రూ.15లక్షల చెక్కు అందిస్తున్న తపాలా అధికారులు

**డాక్ నిర్యత్ కేంద్ర్..**

ఇప్పటివరకు కేవలం దేశంలోనే పార్సిళ్లు పంపే సౌకర్యం ఉండేది. గతేడాది నుంచి డాక్ నిర్యత్ కేంద్ర్ అనే నూతన పథకంతో తపాలా శాఖ విదేశాలకు వినియోగదారులు తమ ఇళ్ల వద్ద నుంచే పార్సిల్ పంపే అవకాశం కల్పించింది. తపాలా కార్యాలయంలో ఆధార్, పాన్‌తో పేరు నమోదు చేసుకుంటే సదరు వినియోగదారుకు ప్రత్యేక నంబరు కేటాయిస్తారు. ఇండియా పోస్ట్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఇంటి నుంచే పార్సిళ్లు బుక్ చేసే అవకాశం ఉంటుంది. తపాలా సిబ్బంది ఆయా అడ్రస్‌కు చేరుకుని పార్సిళ్లు తీసుకెళ్లడం, డెలివరీ చేయడం చేస్తారు. తక్కువ వ్యవధిలో, తక్కువ రుసుముతో ఈ సౌకర్యం ఏర్పాటుచేయడంతో జిల్లాకేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాలకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లాకేంద్రాల్లోని ప్రధాన తపాలా కార్యాలయాల్లో నిత్యం ఈ పథకం ద్వారా విదేశాలకు పార్సిళ్ల పంపకం పెరగడంతో దాదాపు వేల రూపాయల ఆదాయం సమకూరుతోంది.

DAK GHAR NIRYAT KENDRA

**ఈ కామర్స్‌తో ఒప్పందం..**

ప్రస్తుతం ఈ కామర్స్ సంస్థలు శరవేగంగా తమ సర్వీసులు అందిస్తున్నాయి. వీటిని అందిపుచ్చుకుంటూనే పోస్టల్‌శాఖ వాటితో జతకట్టి దేశవ్యాప్తంగా పార్సిల్ సేవలు అందిస్తోంది. దాదాపు ప్రతి గ్రామీణ ప్రాంతాలలో పోస్టల్ సేవలు ఉండటంతో ఈ కామర్స్ దిగ్గజం అమెజాన్ సంస్థ పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో అమెజాన్‌లో బుకింగ్ చేసిన పార్సిళ్లు పోస్టల్‌శాఖ ద్వారా బట్వాడా చేయనున్నారు. దీంతో పోస్టల్‌కు అదనపు ఆదాయం సమకూరనుంది. ఈ కామర్స్ ఒప్పందంతో తపాలా నాణ్యమైన, మన్నికైన సేవలు అందిస్తామని నాగర్‌కర్నూల్ జిల్లా తపాలా అధికారి సృజన్‌నాయక్ వివరించారు.

India Post enters in E-commerce

**బ్యాంకు సేవలతో...**

తపాలా కార్యాలయాలు కేవలం ఉత్తరాల బట్వాడా, పొదుపు ఖాతాలకే పరిమితం కాకుండా బ్యాంకు సేవలు అందించేందుకు ఏడేళ్ల క్రితం ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకుగా సేవలు మొదలు పెట్టింది. వీటి ద్వారా ఆధార్ ఎనేబుల్ సిస్టంతో లబ్ధిదారుల ఇంట్లోనే వారి బ్యాంకు లావాదేవీలు, చెల్లింపులు చేస్తోంది. ప్రమాదబీమా, ఇతర బీమా పథకాలు అందిస్తోంది. తపాలా బ్యాంకు ఏర్పాటుతో రుణాలు మంజూరు కూడా శ్రీకారం చుడుతోంది. ఇతర బ్యాంకులు ఏవిధమైన సేవలు అందిస్తాయో, వాటికి దీటుగా గ్రామాల్లో తపాలా బ్యాంకు సేవలు అందించేందుకు తపాలా శాఖ నడుంబిగించింది. దీంతో తపాలా శాఖ ఆర్థికపరిపుష్టితో పుంజుకునేందుకు ప్రయత్నిస్తోంది.

India Post Payments Bank

**గ్రామీణ ప్రాంతాల్లోనూ 73 రకాల సేవలు..**



కామన్ సర్వీస్ సెంటర్ మాదిరిగా తపాలా కార్యాలయాలు కూడా పనిచేయనున్నాయి. 73రకాల సేవలు (గ్రామీణప్రాంతాల్లో) అందిస్తున్నాయి. కరెంటు బిల్లులు, బస్, ట్రైన్ బుకింగ్, పాస్‌పోర్ట్ సేవలు (వనపర్తి, మహబూబ్‌నగర్‌లలో) అందిస్తున్నారు. పోస్ట్ సేవింగ్‌బ్యాంక్ ఖాతాలతో తపాలాబ్యాంకు ఖాతాలను అనుసంధానం చేస్తుండటంతో బ్యాంకు లావాదేవీలు చరవాణిలోనే చేసుకునే వెసులుబాటు ఉంటోంది. సేవింగ్ ఖాతాలకు ఏటీఎం కార్డు సౌకర్యం కూడా తపాలా శాఖ కల్పించింది. జిల్లా కేంద్రాల్లో తపాలా కార్యాలయాల వద్ద ఏటీఎం కేంద్రాలను కూడా ఏర్పాటుచేసింది. దీంతో తపాలా శాఖకు నిత్యం రూ.వేల ఆదాయం సమకూరుతోంది.

**ఆదరణ బాగుంది..**



చిన్నమొత్తాల పొదుపుఖాతాలతో పాటు తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్ ఖాతాలు, ఈ-సేవ, సుకన్య సమృద్ధి యోజన పేరిట ఆడపిల్లలకు పొదుపు పథకాలు ఆదరణ పొందాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి చెల్లింపులు, ఆసరా పింఛన్లు బయోమెట్రిక్ ద్వారా చెల్లిస్తున్నాం.. అటల్ పింఛన్ యోజన, సీనియర్ సిటిజన్ పథకం, ప్రధాన మంత్రి జీవన బీమా, మంత్లీ ఇన్ కమ్ పథకం, ఇతర పథకాలున్నాయి. ఏడాది వ్యవధిలో ప్రమాదబీమా పథకంలో రూ.599 ప్రీమియం చెల్లించి రూ. 10 లక్షల పరిహారం పథకం, రూ. 799 చెల్లిస్తే రూ. 15లక్షలు పరిహారం అందుతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 బాధిత కుటుంబాలకు పరిహారం ఇచ్చాం.

**- భూమన్న, వనపర్తి డివిజన్ పర్యవేక్షకులు**

# చేనేత సహకార సంఘం పనితీరు భేష్

**అమరచింత, న్యూస్‌టుడే:** అమరచింత చేనేత ఉత్పత్తిదారుల సహకార సంఘం పనితీరు స్ఫూర్తిదాయకంగా ఉందని వివిధ రాష్ట్రాల నాబార్డ్ అధికారులు కొనియాడారు. పట్టణ శివారులోని సహకార సంఘాన్ని మంగళవారం కర్ణాటక, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి నాబార్డ్ ఆధ్వర్యంలో 50 మంది సభ్యులు సందర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నాబార్డ్, డీసీసీబీ బ్యాంకు అధికారుల చేయూతతో అమరచింత పట్టణంలోని చేనేత కార్మికులు సంఘం ఏర్పాటు చేసుకున్నారు. అమరచింత సహకార సంఘం సీఈవో చంద్రశేఖర్ వారికి వివరించారు. చేనేత కార్మికులు ఒక యజమాని వద్ద చేనేత పని చేయకుండా స్వయంగా ఇక్కడ మగ్గం ఏర్పాటు చేసుకుని సంఘం ద్వారా ఉత్పత్తి చేయించుకుంటూ, వచ్చిన లాభాలను ప్రతి ఏడాది తీసుకోవడం జరిగిందన్నారు. ఇంట్లో మగ్గం ఏర్పాటుకు స్థలం లేనివారు కూడా ఇక్కడ నేత పనిలో ఉన్నట్లు చెప్పారు. సంఘం ద్వారా జరిగే ప్రతి ఖర్చు, జమ అంశాల్లోనూ నమోదు చేయడంతో పాటు ప్రభుత్వానికి నాబార్డ్ ద్వారా తెలియజేస్తున్నట్లు వివరించారు. డీసీసీబీ బ్యాంకుల ద్వారా కార్మికులకు రుణాలు ఇప్పించి వారికి వచ్చే నెల వేతనంలో అప్పు చెల్లించే విధంగా చేశామన్నారు. కర్ణాటక డీజీఎం సతీష్ కర్ర, బీఆర్‌డీ డీజీఎం యోగేష్, నాబార్డ్ అధికారి సుబ్బారావు చారి, డీసీసీబీ ఆత్మకూరు మేనేజర్ నబీ, సభ్యులు పాల్గొన్నారు.


మగ్గంపై నేస్తున్న చీరను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

## 24న బీచుపల్లిలో సీతారాముల కల్యాణం

**ఇటిక్యాల, న్యూస్‌టుడే:** పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో ఈ నెల 24న సీతారాముల కల్యాణం ఏర్పాటు చేసినట్లు కోదండ రామాలయ మేనేజర్ సురేందర్ రాజు తెలిపారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసు పురస్కరించుకొని కోదండరామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ మేనేజర్ సూచించారు.

# చదువు రాకపోయినా ఆంగ్లంలో చేవ్రాలు!

## సిబ్బంది పేరిట దొంగ సంతకాలతో నిధులు స్వాహా

వారంతా కిందిస్థాయి సిబ్బంది.. చెప్పిన పని చేసి వెళ్లడం తప్పా.. ఏనాడు ఇదేంటని ప్రశ్నించలేని అమాయకత్వం.. ఎన్నికల సందర్భంగా వారి పేరిట ప్రోత్సాహక నిధులు విడుదలయ్యాయి. వారికి తెలియకుండా అధికారులే దిగమింగారు. కనీస చదువు రాని వారు ఆంగ్లంలో సంతకం చేసిన డాక్యుమెంట్ బయటపడటంతో అవినీతి వెలుగులోకి వచ్చింది. అప్రమత్తమైన సదరు అక్రమార్కులు సిబ్బందిని పిలిచి తలా కొంత ఇస్తాం తీసుకోండి అంటే ఆత్మాభిమానంతో 'మాకొద్దంటూ..' వెళ్లడం కొసమెరుపు.

**- న్యూస్‌టుడే, నాగర్‌కర్నూల్**

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లో పార్లమెంటరీ ఎన్నికల సమయంలో పనిచేసిన కార్మికులకు డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా తప్పుడు సంతకాలు పెట్టుకొని నిధులు డ్రా చేసుకున్నారు. దీనిపై కలెక్టరేట్‌లో గుసగుసలు మొదలయ్యాయి. ఎంపీ ఎన్నికల సమయంలో నిధుల విషయంలో పక్కదారి పట్టించారనే విమర్శలున్నాయి. కలెక్టరేట్‌లో స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది, గార్డెన్‌లో పనిచేసే సిబ్బంది మొత్తం 20 మంది వరకు ఎంపీ ఎన్నికల సమయంలో విధులు నిర్వర్తించారు. కాని ఎవ్వరికి డబ్బులు ఇవ్వలేదు. ఒక్కరికి మాత్రమే రూ.18 వేలు చెల్లించారు. మిగతా వారికి డబ్బులు ఇవ్వకపోగా 13 మందికి రూ.18వేల చొప్పున డబ్బులు చెల్లించినట్లుగా దొంగ సంతకాలు పెట్టి నిధులు డ్రా చేసుకున్నారు. గార్డెన్‌లో పని చేసే వారికి చదువు రాదు కానీ రెవెన్యూ స్టాంప్‌పై ఆంగ్లంలో సంతకాలు పెట్టుకోవడం చర్చనీయాంశమైంది. అన్ని ఒక్కరే సంతకాలు పెట్టినట్లుగా సమాచారం. ఈ విషయం బయటికి రావడంతో ఇటీవల కలెక్టరేట్‌లో ఉండే అధికారులు పనిచేసిన వారిని పిలిచి రూ.2వేలు, రూ.5వేలు చొప్పున ఇస్తామని చెప్పడంతో తమకు ఈ డబ్బులు వద్దంటూ వెళ్లిపోయారు. జిల్లాలో ఎన్నికల విధుల చెల్లింపుల్లో అవకతవకలపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపడతారోనని ఉత్కంఠ నెలకొంది.


రెవెన్యూ స్టాంప్‌లపై తప్పుడు సంతకాలు పెట్టినట్లుగా బయటికి వచ్చిన పత్రాలు




## ఇదీ అంగన్వాడీ దుస్థితి

అంగన్వాడీ కేంద్రాలు ఎలాంటి వసతి సమస్యలు ఎదుర్కొంటున్నాయో ఈ చిత్రాలను చూస్తే తెలుస్తుంది. ఊట్కూరు మండలం పులిమామిడిలో సరైన భవనాలు లేక నాలుగు అంగన్వాడీ కేంద్రాలను ఒకే భవనంలో కొనసాగిస్తున్నారు. ఒక్కొక్క కేంద్రంలో దాదాపుగా 18 మంది పిల్లలు ఉన్నారు. ప్రస్తుత భవనంలో ఒక గది, వరండా మాత్రమే ఉన్నాయి. గదిలో నాలుగు కేంద్రాల సామగ్రి ఉంచడానికే చాలడం లేదు. వరండాలో 72 మంది పిల్లలను కూర్చోబెట్టి నాలుగు వైపులా నలుగురు టీచర్లు పర్యవేక్షిస్తుండటాన్ని చిత్రంలో చూడొచ్చు.

**- న్యూస్‌టుడే, నారాయణపేట**

## నేటి నుంచి ఉమ్మడి జిల్లా స్థాయి గురుకుల క్రీడలు

**కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే :** కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల గురుకుల విద్యాలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు మంగళవారం కల్వకుర్తికి చేరుకున్నారు. గురుకుల సొసైటీ పరిధిలోని మొత్తం 16 పాఠశాలల నుంచి సుమారు 540 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామోపాధ్యాయురాలు సింధు తెలిపారు.

## కోయనగర్ సమాఖ్య ఆర్పీ శ్రీలతపై కేసు

**మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే :** స్వయం సహాయక సంఘాల డబ్బులను పక్కదారి పట్టించిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ)పై పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామీణా ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం,.. మహబూబ్‌నగర్ పట్టణం వేంకటేశ్వర కాలనీకి చెందిన శ్రీలత మెప్మాలో ఆర్పీగా పనిచేస్తున్నారు. 2017 మార్చి నుంచి ఆమె కోయనగర్ మహిళా సమాఖ్య ఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్నారు. 30 స్వయం సహాయక సంఘాలకు చెందిన బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, పొదుపు డబ్బులు రూ.1,49,36,205 పక్కదారి పట్టినట్లు విచారణ తేలిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పురపాలిక కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## శ్రీశైలంలో 2 గేట్ల ద్వారా నీటి విడుదల

**శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే :** శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. ప్రాజెక్టు 2 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 55,508 క్యూసెక్కులు.. కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 66,331 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు జలాశయం నీటి మట్టం 884.30 అడుగులుగా (211.4759 టీఎంసీలు) ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల జలాశయం నుంచి 62,158 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 31,858 క్యూసెక్కుల వరద నీళ్లు శ్రీశైలంలోకి చేరుతోంది.


గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

## సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో రజతం


రజతం సాధించిన జట్టుతో సంఘం సభ్యులు

**మహబూబ్‌నగర్ క్రీడలు, న్యూస్‌టుడే:** వరంగల్‌లో ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు రజతం వరించింది. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టును అభినందించారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ సంఘం కార్యదర్శి సాదిఖ్‌అలీ, ఉపాధ్యక్షుడు శరత్‌చంద్ర, కోశాధికారి ఆనంద్, సభ్యులు రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, శిక్షకులు కపిల్ వర్మ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

**వనపర్తి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఉన్నతాధికారి వేధింపులు తాళలేక ఈవో వినోద మంగళవారం నిద్ర మాత్రలు వేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుర్తించి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. ప్రసుత్తం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బాధితురాలు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలాలా ఉన్నాయి.. 2022 నవంబరులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా వినోద ఎంపికయ్యారు. పెబ్బేరులో విధుల్లో చేరాల్సి ఉండగా అప్పటి డీడబ్ల్యూవో పుష్పలత కార్యాలయ అవసరాల నిమిత్తం ఆమెను డిప్యూటేషన్‌పై జిల్లా శిశు సంక్షేమశాఖ కార్యాలయంలో ఈవోగా తీసుకున్నారు. ఇటీవల ఇన్‌ఛార్జి డీడబ్ల్యూవోగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మమ్మ.. వినోదను పెబ్బేరు వెళ్లాలని ఒత్తిడి చేశారు. వ్యక్తిగత కారణాల నేపథ్యంలో కొంత సమయం కావాలని తర్వాత వెళ్తానని చెప్పినా వినకుండా లక్ష్మమ్మ సోమవారం ఇక్కడి నుంచి రిలీవ్ కావాలని అసభ్య పదజాలంతో దూషించారని తెలిపారు. లక్ష్మమ్మ, మరో అధికారి వేధింపులతో మనస్తాపం చెంది నిద్ర మాత్రలు వేసుకున్నట్లు బాధితురాలు తెలిపారు. ఈ విషయమై లక్ష్మమ్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సూపర్‌వైజర్ల కొరత వల్ల ఆమె స్థానానికి వెళ్లాలని సూచించామన్నారు. అంగన్‌వాడీ సెంటర్లపై పర్యవేక్షణ ఉండాలని అందుకోసం తప్పకుండా వెళ్లాలని సోమవారం ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. బాధితురాలు తనపై చేస్తున్న ఆరోపణలు అవాస్తవాలన్నారు.

## వసతిగృహంలో బీటెక్ విద్యార్థి బలవన్మరణం

**మేడ్చల్, న్యూస్‌టుడే:** వసతి గృహంలో విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు చెందిన సిద్ధార్థయాదవ్ (19) మేడ్చల్ పట్టణం ఉమానగర్‌లోని వీఐపీ వసతి గృహంలో ఉంటున్నాడు. కిస్టాపూర్‌లోని మల్లారెడ్డి కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం వసతిగృహానికి వచ్చాడు. మంగళవారం తోటి విద్యార్థులంతా కళాశాలకు వెళ్లారు. సిద్ధార్థయాదవ్ కళాశాలకు వెళ్లలేదు. సాయంత్రం తన గది లోపల నుంచి గడి పెట్టి ఉంది. తలుపులు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని విగతజీవిగా కనిపించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి ఫోన్‌లో పలు ఆన్‌లైన్ గేమింగ్ యాప్‌లు ఉండటంతో పోలీసులు ఆ కోణంలో విచారణ చేస్తున్నారు.

## లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం: ఒకరి దుర్మరణం

**కృష్ణా, న్యూస్‌టుడే :** వాసూనగర్ ఆర్టీవో చెక్‌పోస్ట్ ఎదురుగా ఆగి ఉన్న లారీని బైకుతో ఢీకొని మాగనూరు మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన మంగలి శేఖర్(36) మృతి చెందాడు. మంగళవారం కొత్తపల్లి నుంచి కర్ణాటకలోని దేవసూగూరుకు వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తీవ్రంగా గాయపడ్డ శేఖర్‌ను దేవసూగూర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. శేఖర్‌కు భార్య, పదేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కృష్ణా ఏఎస్ఐ కతలప్ప తెలిపారు.


శేఖర్

## అప్పు వివాదం... పరస్పరం కేసులు

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అప్పు విషయంలో చోటుచేసుకున్న వివాదంతో యువతి, యువకుడు పరస్పరం ఠాణాలో ఫిర్యాదు చేసుకున్న ఘటన ఇది. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తికి చెందిన రవీందర్‌నాయక్‌కి కొన్నాళ్ల క్రితం తన సోదరి ద్వారా గుంటూరుకు చెందిన శ్రావణి పరిచయం అయ్యింది. శ్రావణి అమీర్‌పేట్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. ఇద్దరి పరిచయం స్నేహంగా మారింది. శ్రావణి తండ్రి అనారోగ్యంతో ఉండటంతో రవీందర్‌నాయక్ నుంచి రూ.6 లక్షలు అప్పు తీసుకుంది. రవీందర్ డబ్బుల కోసం ఫోన్ చేయగా దాటవస్తూ వస్తోంది. ఈనెల 20న రాత్రి 9గంటల ప్రాంతంలో యూసుఫ్‌గూడలోని కృష్ణకాంత్ పార్కులో ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. కోపంతో శ్రావణి, రవీందర్‌నాయక్‌ను చెంపదెబ్బకొట్టింది. తర్వాత ఫోన్ చేయగా రెండు బైక్‌లపై వచ్చిన నలుగురు యువకులు దేవరాజ్, తేజ, కార్తికేయ, ఇదాయత్ రవీందర్ నాయక్‌ను చితక్కొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, అప్పు తీసుకున్నందుకు తనను పెళ్లిచేసుకోవాలని వేధింపులకు గురిచేయడంతో పార్కుకు పిలిపించి, స్నేహితుల ముందు అవమాన పరిచాడని, దాడిచేసి గాయపరిచాడని రవీందర్‌నాయక్‌పై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసులు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

**చికెన్ ధరలు**

| | |
|---|---|
| ఫాంరేటు | 125-00 |
| రిటైల్ | 147-00 |
| డ్రెస్డ్ | 213-00 |
| స్కిన్‌లెస్ | 243-00 |

మేమున్నాం.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

**మీకు తోడుగా..**

| | |
|---|---|
| నాగర్‌కర్నూలు | 7993300530 |
| అచ్చంపేట | 8008573927 |
| కల్వకుర్తి | 9908803650 |
| కొల్లాపూర్ | 8008573870 |

**తెరపై ఈనాడు**

నాగర్‌కర్నూల్‌లో.. రవి : దేవర
రమణ : వేట్టయన్ ద హంటర్
రామకృష్ణ : ఇద్దరు. కల్వకుర్తిలో.. పార్థసారథి : దేవర. అశోక్ : వేట్టయన్ ద హంటర్

## కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



కందనూలు, న్యూస్‌టుడే : టమాటా 55, వంకాయ 65, బెండ 64, మిరప 80, కాకర 65, బీర 64, క్యాలీఫ్లవర్ 70, క్యాబేజీ 48, క్యారెట్ 65, దొండ 50, ఆలుగడ్డ 45, ఉల్లిగడ్డ 58, గోకర 60, దోస 44, ఆనంకాయ 18, చిక్కుడు 65, మునగకాయ 70, బీట్‌రూట్ 50, ఖీర, 45, బీన్స్ 90.

# సీసీఐ కేంద్రాలు ప్రారంభం ఎప్పుడు?

**వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్న రైతులు • ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాతలు**



నాగర్‌కర్నూల్ : తెల్కపల్లి మండలంలో పత్తిని కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

**కందనూలు, తాడూరు న్యూస్‌టుడే :** ప్రస్తుత ఏడాది ఖరీఫ్‌లో పత్తి అధిక దిగుబడి వస్తుందని రైతులు ఆశించినా సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన అకాల వర్షాలకు తెగుళ్లు వ్యాపించి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీనికి తోడు మార్కెటింగ్‌శాఖ అధికారులు అధికారికంగా సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఇండియా) కేంద్రాలు ప్రారంభించకపోవడం వలన రైతులు ప్రైవేట్ వ్యాపారులకు పత్తిని విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు పత్తి తేమశాతం ఎక్కువగా ఉందని, వర్షానికి పత్తి నల్లగా మారిందని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీని వలన అన్నదాతలు ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లో పత్తిని కొనుగోలు చేస్తున్నా.. మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**జిల్లాలో 2,18,841 ఎకరాల్లో పత్తి సాగు :** తాడూరు, తెల్కపల్లి, తిమ్మాజిపేట, బిజినేపల్లి, నాగర్‌కర్నూల్, అమ్రాబాద్, పదర, తదితర మండలాల్లో కలిపి మొత్తం 2,18,841 ఎకరాల్లో పత్తిని సాగు చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌కు సంబంధించి సెప్టెంబర్, అక్టోబర్‌లో కురిసిన అకాల వర్షాల వలన తెగుళ్లు వ్యాపించి పంట పూర్తిగా దెబ్బతిన్నది. వ్యవసాయశాఖ అధికారులు ఒక ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసిన ప్రస్తుతం 7 నుంచి 6 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రైతులు ఒక్కొక్కరికి రోజు రూ. 400 వరకు కూలీ చెల్లించి పత్తిని తెంపుతున్నారు. కొంత మంది రైతులు కూలీలకు డబ్బులు లేక పోవడంతో వెంటనే గ్రామాలకు వచ్చే వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన వ్యాపారులు పత్తి తేమశాతం ఎక్కువగా ఉంది, వర్షాలకు పత్తి నానడం వలన నల్లగా మారిందని కారణాలు చూపుతూ క్వింటా రూ. 5,000 నుంచి రూ. 5,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో 8 శాతం తేమ కల్గిన పత్తికి క్వింటా రూ. 7,521 చెల్లిస్తామని పేర్కొంది. 9 నుంచి 10 శాతం తేమ ఉంటే క్వింటా రూ. 7,471 చొప్పున 11 నుంచి 12 శాతం తేమ ఉంటే క్వింటా రూ. 7,421 చొప్పున మద్దతు ధర ప్రకటించింది. మార్కెటింగ్ శాఖ అధికారులు సకాలంలో సీసీఐ కేంద్రాలు ప్రారంభించకపోవడం వలన రైతులు వ్యాపారులకు విక్రయించి క్వింటా మీద దాదాపు రూ. 2 వేల మేరకు ఆర్థికంగా నష్టపోతున్నారు. వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ మిల్లులో క్వింటా రూ. 6 వేల వరకు విక్రయిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**18 కేంద్రాలకు ప్రతిపాదనలు.. :** జిల్లాలో 18 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపించగా 15 కేంద్రాలకు అనుమతి లభించింది. అందుకు సంబంధించిన సాఫ్ట్‌వేరును అనుసంధానం చేశారు. రైతులు కేంద్రాల వద్దకు వచ్చి సీసీఐ కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారని నిర్వాహకులను అడిగితే దీపావళి పండుగ తరువాత ప్రారంభిస్తామని చెబుతున్నారు. సీసీఐ కేంద్రాల్లో ఏటా ఆలస్యంగా పత్తిని కొనుగోలు చేయడం వలన ఆర్థికంగా నష్టపోతున్నామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి కేంద్రాలను ప్రారంభించినట్లు అధికారికంగా ప్రకటన చేస్తే పత్తిని ఆరబెట్టి తీసుకవస్తామని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాలు త్వరగా ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.




నాగర్‌కర్నూల్ : తాడూరు గ్రామ శివారులో పత్తిని తెంపుతున్న కూలీలు

### అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం..

జిల్లాలో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయడానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. సీసీఐ సిబ్బంది జిన్నింగ్ మిల్లుల వద్ద ఉన్నారు. రైతులు ఆరబెట్టి తేమ శాతం తక్కువగా ఉండే విధంగా పత్తిని తీసుకవచ్చి కేంద్రాల్లో విక్రయించాలి. ఎట్టి పరిస్థితిల్లో వ్యాపారులకు విక్రయించవద్దు.

- స్వర్ణన్ సింగ్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి

## జడ్పీటీసీ నుంచి వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా



కేవీఎన్‌రెడ్డి

**వంగూరు, న్యూస్‌టుడే :** సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లికి చెందిన కేవీఎన్‌రెడ్డి వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియామకం కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కేవీఎన్‌రెడ్డి 1985లో ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ యువజన సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. 1994లో జలసాధన సమితి ఏర్పాటు చేసి అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలకు సాగునీరు అందించాలని గ్రామంలో 10 రోజుల పాటు ఆమరణనిరాహార దీక్ష చేపట్టారు. వంగూరు జడ్పీటీసీ సభ్యుడిగా, టీపీసీసీ అధికార ప్రతినిధిగానూ పనిచేశారు. వ్యవసాయంపై ఆయనకు మక్కువ. అందుకోసమే వ్యవసాయ కమిషన్ సభ్యుడిగా నియమించారని గ్రామ నాయకులు ఎనుముల వేమారెడ్డి, బొజ్జ కృష్ణారెడ్డి, కడారి రాఘవేందర్, రాము, లాలుయాదవ్ చెప్పారు.

## కల్లు శాంపిల్ సేకరణ

**లింగాల, న్యూస్‌టుడే :** కల్తీ కల్లు తాగి అపస్మారక స్థితికి చేరుకొని నాగర్‌కర్నూల్ ప్రభుత్వాసుపత్రిలో మణెమ్మ చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆబ్కారీ సూపరింటెండెంట్ గాయిత్రి ఆదేశాల మేరకు ఆబ్కారీ సీఐ రమణయ్య, సిబ్బంది సోమవారం రాత్రి రాంపురంలో కల్లు విక్రయిస్తున్న సత్యంగౌడ్ దుకాణం నుంచి కల్లు శాంపిళ్లు సేకరించారు. వాటిని హైదరాబాద్ ల్యాబ్‌లో పరీక్షలు చేయిస్తున్నట్లు సీఐ మంగళవారం చెప్పారు.

## త్వరలోనే సాగు నీటి సరఫరాకు చర్యలు

**బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే :** రామన్‌పాడు పంపులతో మండలంలోని ఆయా గ్రామాలకు సాగు నీరందించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. మండలంలోని ఇప్పకుంట గేటు వద్ద కేఎల్ఐ కాల్వ నుంచి రామన్‌పాడు సంపు హౌస్‌లోకి ఏర్పాటు చేసిన పైపులైన్ పనులను మంగళవారం పరిశీలించారు. రెండు 15 హెచ్.పి.మోటార్ల ద్వారా 4 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన సంపు నింపి గట్టుతుమ్మెన్, రామాజిపల్లి, వీరంరాజుపల్లి, కొండనాగుల వరకు సాగునీరు అందిస్తామని చెప్పారు. మరో రెండు, మూడు రోజుల్లో ట్రయల్ రన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మధుబాబు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రాథోడ్ పాల్గొన్నారు.

## బోధనేతర ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

**వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే :** వెల్దండ మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో బోధనేతర పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(గురుకులం) ప్రాంతీయ సమన్వయాధికారి పీఎస్. కల్యాణి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కేటరింగ్ అసిస్టెంట్-1, హాస్టల్ వార్డెన్(మహిళ)-1, ఎలక్ట్రీషియన్/ప్లంబర్ 1, అసిస్టెంట్ కుక్/కిచెన్ హెల్పర్-2 పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. 30వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 97042 44232, 98857 38387లో సంప్రదించాలన్నారు.

## నీటి సరఫరాపై అవగాహన తప్పనిసరి

**తిమ్మాజిపేట, న్యూస్‌టుడే :** ప్రజలకందించే తాగునీటి సరఫరాపై పూర్తిస్థాయి అవగాహన ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్దిలేటి సూచించారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల గ్రామీణ మంచినీటి సహాయకుల శిక్షణా శిబిరంలో మాట్లాడారు. బోరుమోటార్లకు విద్యుత్ సరఫరా, మోటారు, ఫ్యూజులు, స్టార్టర్ల ఏర్పాటు తెలుసుకోవాలన్నారు. పైపులైన్ల లీకేజిని అరికట్టే విధానాన్ని, మరమ్మతులు, నీటి సరఫరా సమయాలు, నీటి నాణ్యత కొలిచే విధానాలపై వివరించారు. ప్రజలకు పరిశుభ్రమైన మంచినీరు అందించమే లక్ష్యంగా పనిచేయాలని, ఎక్కడా నీటికి ఇబ్బందులు పడకూడదన్నారు. ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేపై ఆరోపణలు సరికాదు

**అమ్రాబాద్, న్యూస్‌టుడే :** నియోజకవర్గ అభివృద్ధి కోసం నిత్యం తపిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణపై ఆరోపణలు చేయడం మానుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలను అమ్రాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఖండించారు. పదేళ్ల అధికారంలో ఉన్న భారాస నియోజకవర్గాన్ని ఎంత అభివృద్ధి చేసిందో ఆత్మవిమర్శ చేసుకోవాలన్నారు. సమావేశంలో నేతలు కృష్ణయ్యగౌడ్, తిర్మలయ్య, లింగం పాల్గొన్నారు.

## బ్యాంకు సేవలపై అవగాహన

**లింగాల, న్యూస్‌టుడే :** బ్యాంకుల్లో సేవలపై సీఎఫ్‌ఎల్ ప్రాజెక్టు డీసీవో శేఖర్‌రెడ్డి వినియోగదారులకు అవగాహన కల్పించారు. మంగళవారం రాయవరంలో బ్యాంకు వినియోగదారులతో సమావేశమై మాట్లాడారు. పీఎం జీవనజ్యోతి, సురక్షబీమా తదితర పథకాలను వివరించారు. ఎండీ మన్సూర్, రూపేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

## సీసీఐ కొనుగోలు కేంద్రాలతోనే రైతులకు న్యాయం

**కల్వకుర్తి, న్యూస్‌టుడే :** పత్తి రైతులు దళారుల చేతుల్లో మోసానికి గురై క్వింటా పత్తికి రూ. 1,500 నుంచి రూ. 2,000 వరకు నష్టపోతున్నారని, వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు తెరవటానికి చర్యలు చేపట్టాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్వకుర్తి ఆర్డీవో శ్రీనును కలిసి వినతిని అందించారు. ప్రభుత్వం సకాలంలో రైతు బంధు పథకం అమలు చేయకపోవటంతో, రైతులు ఇబ్బందులకు గురయ్యారని వాపోయారు. రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మితే క్వింటా పత్తిని రూ. 5,000 నుంచి రూ. 6,000 వరకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు అంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యలు పరిష్కరించాలని వినతి

**వెల్దండ, న్యూస్‌టుడే:** భూముల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవిని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నాగర్‌కర్నూల్ వెళ్తున్న ఎంపీ వెల్దండలో కాసేపు ఆగారు. దీంతో కాంగ్రెస్ నాయకులు రైతులు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రం అందజేశారు. నాయకులు పుల్లయ్య, ఎర్ర శ్రీను, మట్ట నాగేశ్వర్‌గౌడ్, లింగం ముదిరాజ్, వెంకటరాములు పాల్గొన్నారు.

## వేధింపులకు పాల్పడితే కేసులు నమోదు చేస్తాం



విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రామేశ్వర్

**కందనూలు, న్యూస్‌టుడే :** అమ్మాయిలను వేధిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ హెచ్చరించారు. పూలపాకల సంఘం పరిధిలోని నాగనూల్ కస్తూర్బా విద్యాలయంలో మంగళవారం షీటీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించగా అదనపు ఎస్పీ పాల్గొని మాట్లాడారు. బయటి ప్రాంతంలో అమ్మాయిలను ఎలాంటి ఇబ్బందులకు గురిచేసినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. మండల కేంద్రాల్లో, పట్టణాల్లో షీటీం ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షీటీం ఏఎస్సై విజయలక్ష్మి, కేజీబీవీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శశికళ, భరోసా కేంద్రం సమన్వయకర్త శ్రీలత, షీటీం సిబ్బంది వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**కోడేరు, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో భాస్కర్ శర్మ మంగళవారం తెలిపారు. ఇంటర్, ఏఎన్ఎం కోర్సు చేసిన వారు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## జీవో 29 రద్దు చేయాలి



కుమురం భీం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

**కందనూలు, న్యూస్‌టుడే :** రాష్ట్ర ప్రభుత్వం జీవో సంఖ్య 29 రద్దు చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 సంఖ్య వలన గ్రూప్ -1 పరీక్షల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జల్ జంగల్ పోరాట యోధుడు కుమురం భీం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ అసెంబ్లీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నాయకులు పృథ్వీరాజ్, రాజు, రాంచందర్, శేఖర్, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దాడులు చేయడం సరికాదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే :** కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడటం.. అక్రమ కేసులు పెట్టి అరాచకాలు చేయటం సరికాదని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. అచ్చంపేట పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల భారాస పాలనలో కేసులు పెట్టలేదని, గుట్టతుమ్మెన్‌లో 30 మంది భారాస కార్యకర్తలపై కేసులు పెట్టడం తగదన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం సరికాదన్నారు. జలీవల గుప్త నిధుల తవ్వకాల్లో దొరికిన ఎమ్మెల్యే వంశీకృష్ణ అనుచరులపై చర్యలు తీసుకోకపోవడంలో పోలీసుల వైఫల్యాన్ని విమర్శించారు. తాము మైలారం గుట్ట మైనింగ్ పనులు నిలిపేస్తే ఇప్పుడు అనుమతులిచ్చారని చెప్పారు. అచ్చంపేట ఎత్తిపోతల పథకం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట పుర మాజీ ఛైర్మన్ నర్సింహగౌడ్, మాజీ జడ్పీటీసీ రాంబాబు, కొండనాగుల సింగిల్‌విండో ఛైర్మన్ నర్సయ్యయాదవ్, రమేశ్‌రావు, అమీనొద్దీన్, కేటీ తిరుపతయ్య, రవిందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సంఘాలు.. నియామకాలు

### ఏబీవీపీ పట్టణ కార్యవర్గం

**కల్వకుర్తి, న్యూస్‌టుడే:** కల్వకుర్తి నగర ఏబీవీపీ శాఖ ప్రధాన కార్యదర్శిగా వంశీగౌడ్ ఎంపికయ్యారు. మంగళవారం పట్టణలో కార్యవర్గ సమావేశం జరిగింది. పాలమూరు జిల్లా విభాగ్ కన్వీనర్ నరేశ్‌తేజ, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్ శివశంకర్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. కల్వకుర్తి నగర శాఖ ప్రధాన కార్యదర్శిగా వంశీగౌడ్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శిగా సుందర్

**కల్వకుర్తి, న్యూస్‌టుడే :** కల్వకుర్తి ఆర్టీసీ డిపోకు చెందిన దార సుందర్ ఉమ్మడి పాలమూరు జిల్లా ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలో సంఘం కార్యవర్గ సమావేశం జరిగింది. సుందర్ మూడోసారి ప్రధాన కార్యదర్శిగా ఎంపికవడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.

## ఆముదం సాగు లాభదాయకం





మాట్లాడుతున్న కేవీకే సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి

**బిజినేపల్లి, న్యూస్‌టుడే :** ఆముదం పంట సాగు రైతులకు లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పాలెంలో మండలంలోని చేగుంట, గౌరిట, తిమ్మాజిపేట గ్రామ రైతులకు ఆముదం సాగులో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం జాతీయ ఆహార భద్రత పథకం కింద నూనె గింజల పంటలను ప్రోత్సహిస్తోందన్నారు. కేవీకే ఆధ్వర్యంలో 45 ఎకరాల విస్తీర్ణంలో ఆముదం సామూహిక ప్రదర్శన క్షేత్రాలను ఏర్పాటు చేశారని, రైతులకు పంట కీలక ఉత్పాదకాలు, వినియోగం, మేలైన యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఆముదంలో అధిక దిగుబడి సాధించే పీసీహెచ్-111 అనే రకం మహబూబ్‌నగర్ జిల్లా నేలలకు అనుకూలమని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డా.శైల, విస్తరణ శాస్త్రవేత్త డా.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో లైన్‌మన్‌కు గాయాలు

**చారకొండ (వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే:** విద్యుత్తు సిబ్బంది మధ్య సమాచారలోపం మూలంగా ఓ విద్యుత్తు లైన్‌మన్ విద్యుదాఘాతానికి గురైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. చారకొండ మండలం జూపల్లి గ్రామంలో విద్యుత్తు శాఖ జూనియర్ లైన్‌మన్ అయూబ్‌ఖాన్ విద్యుదాఘాతానికి గురై గాయపడ్డాడు. జూపల్లి 11కెవి విద్యుత్తు ఉప కేంద్రం నుంచి లింగారెడ్డిపల్లి, జూపల్లి గ్రామాల్లో విద్యుత్తు మరమ్మతుల కోసం ఇద్దరు లైన్‌మెన్లు ఒకే సమయంలో వేర్వేరుగా లైన్ క్లియర్ (ఎల్‌సీ) తీసుకున్నారు. ఇద్దరి మధ్య సమాచార లోపంతో జూపల్లి గ్రామంలో లైన్‌మన్ అయూబ్‌ఖాన్ పనులు చేస్తుండగా విద్యుత్తు సరఫరా కావడంతో గాయపడ్డాడు. అతడిని కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడిని ఏడీ శంకరయ్య, ఏఈ జానకిరాములు పరామర్శించారు.

## బాల కార్మికులకు విముక్తి

**తెలకపల్లి, న్యూస్‌టుడే :** మండలంలోని పర్వతాపూర్ గ్రామ వ్యవసాయ పొలంలో పని చేస్తున్న బడిమానేసిన విద్యార్థులను (డ్రాపౌట్) మంగళవారం విముక్తి కల్పించారు. బల్మూర్ మండలం చెంచుగూడెం చెందిన 13 ఏళ్లలోపు ఇద్దరు బాలికలు, లింగాల మండలం మర్యాపూర్‌కు చెందిన బాలుడు (11) కూలీలుగా వెళ్లి రైతు మధుసూదన్‌రెడ్డి చేనులో పత్తి తీస్తున్నారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కవిత, యశ్వంత్, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్, హెడ్ కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ లవకుశ తదితరులు గుర్తించారు. అనంతరం విద్యార్థులను చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరు పరిచారు. 18 ఏళ్ల నిండని పిల్లలను బాల కార్మికులుగా పనులు చేయించడం నేరమని తెలిపారు. తల్లిదండ్రులకు అవగాహన చేసి విద్యార్థులను వారికి అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

**తాడూరు, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమ నిల్వపై అందిన సమాచారం మేరకు మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పోలీసులు దాడి చేశారు. గ్రామానికి చెందిన గణేశ్ ఇంట్లో 26 క్వింటాళ్ల రేషన్‌బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ హేమ్లానాయక్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గురుస్వామి తెలిపారు.

## మొక్కజొన్న క్వింటా గరిష్ఠ ధర రూ.2,255

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం 17 మంది రైతులు 380 క్వింటాళ్ల (760 బస్తాలు) ధాన్యం తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,255, కనిష్ఠ ధర రూ. 1,611 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు.

## బస్సు సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు



పాఠశాలకు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రామాజిపల్లి, సీతారాంపూర్, వీరంరాజుపల్లి, లక్ష్మీపల్లి, బిల్లకల్, తోడేళ్లగడ్డ తదితర గ్రామాల విద్యార్థులు కొండనాగుల జడ్పీ పాఠశాలలో చదువుకుంటున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో వీరు రోజూ కాలినడకన వస్తున్నారు. 3 నుంచి 5 కి.మీ. నడవాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే వరకు రాత్రి 8 అవుతుందని వాపోతున్నారు.

## గాంధీ విగ్రహానికి శంకుస్థాపన

**పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే :** మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్ కార్యాలయం ముందు గాంధీ విగ్రహం ఏర్పాటు చేసేందుకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శంకుస్థాపన చేశారు. వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ జగదీష్ గుప్తా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, చంద్రమౌళి, ఉమామహేశ్, శేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు సమస్యల పరిష్కారానికి వినతి

**పెద్దకొత్తపల్లి, న్యూస్‌టుడే :** జిల్లా నూతన విద్యుత్తు ఎస్ఈ రవికుమార్‌ను జిల్లా కేంద్రంలోని ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం కలిశారు. విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. శివరాజేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ నారాయణరావు, కురుమయ్య, అర్జున్‌సాగర్, నగేష్ పాల్గొన్నారు.

## పంట నష్టం అంచనా

**కొల్లాపూర్, కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే :** వర్షాల వల్ల నష్టం వాటిల్లిన పంటలను అంచనా వేసినట్లు కొల్లాపూర్ ఏవో చిన్నహుస్సేన్ యాదవ్ తెలిపారు. మంగళవారం వరిదేల రెవెన్యూ శివారులో వరి, కంది పంటలను పరిశీలించారు. మండలంలో 120 ఎకరాల్లో వరి, 69 ఎకరాల్లో మినుము పంటలు దెబ్బతిన్నాయని, ఆ నివేదికను జిల్లా అధికారులకు పంపించామని చెప్పారు. ఏఈవో సూర్యతేజ, రైతులు పాల్గొన్నారు.

## పశువైద్యుల నియామకం

**కొల్లాపూర్, న్యూస్‌టుడే :** కొల్లాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పశు వైద్యశాలలకు వైద్యులను నియమించారు. పెంట్లవెల్లికి మౌనిక, కోడేరు అనూషరావు, సాతాపూర్ అశ్విని, నార్లాపూర్‌కు యాదగిరిని నియమించినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. కొల్లాపూర్‌లోని పశువైద్య కేంద్రం ఏడీగా నాగర్‌కర్నూల్ జిల్లా ఏడీ జ్ఞానశేఖర్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారని చెప్పారు.

## సమస్యల పరిష్కారంలో విఫలం

**అచ్చంపేట, న్యూస్‌టుడే :** విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ విమర్శించారు. మంగళవారం అచ్చంపేట డివిజన్‌లోని వివిధ పాఠశాలల్లో తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్, శివ, శ్రీనివాస్‌రెడ్డి, శివప్రసాద్, రవీందర్‌రెడ్డి, తిరుపతయ్య, రాంగోపాల్‌గౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

## వాగులో చిక్కుకున్న వాహనం...తప్పిన ప్రమాదం



పెద్దవాగులో చిక్కుకున్న వాహనం

**కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే :** మండలంలోని ముక్కిగిగుండం పెద్దవాగులో బొలేరో వాహనానికి ప్రమాదం తప్పింది. వివరాలిలా... మంగళవారం వర్షం కురవడంతో వాగు ఉద్ధృతి పెరిగింది. ముక్కిడిగుండం, గోమ్యానాయక్ తండాకు చెందిన దాదాపు 15 మంది బొలేరో వాహనంలో కొల్లాపూర్ నుంచి గ్రామాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో వాగులో వాహనం అదుపుతప్పింది. వాహనాన్ని అక్కడే నిలిపి అందులో ఉన్న వారు దిగి వెళ్లారు. సంఘటనపై ఎస్సై హృషికేశ్ మాట్లాడుతూ.. ముక్కిడిగుండం పెద్దవాగు దాటి రావొద్దన్నారు. వాగు దాటకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

## రోడ్డు పనులు నిలిపి వేయాలని వినతి

**వెల్దండ, న్యూస్‌టుడే :** తన పట్టాభూమిలో నుంచి కొందరు అక్రమంగా నిర్మాణం చేస్తున్న రోడ్డు పనులు నిలిపి వేయాలని కోరుతూ మంగళవారం పోతేపల్లి గ్రామానికి చెందిన రైతు వెంకటయ్య తహసీల్దార్ కార్తిక్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. పోతేపల్లి గ్రామ శివారులోని 125 సర్వే నంబర్‌లో 2.20 ఎకరాల భూమి ఉందని, అందులోకి నుంచి దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

**చరవాణిలో వేధింపులు.. నేరస్థుడికి జైలు శిక్ష**
**కందనూలు, న్యూస్‌టుడే :** నాగర్‌కర్నూల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ వివాహిత యువకుడి వేధింపులతో షీ టీం సిబ్బందిని ఆశ్రయించింది. అచ్చంపేట పట్టణానికి చెందిన యువకుడు చౌడవోని సాయిరాం ఎలాంటి పరిచయం లేకున్నా వివాహితను చరవాణిలో వేధిస్తున్నాడు. కొన్ని రోజులుగా వేధింపులు కొనసాగుతుండటంతో భరించలేక బాధితురాలు షీటీం సిబ్బందికి ఫిర్యాదు చేశారు. షీటీం ఏఎస్సై విజయలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య రంగంలోకి దిగారు. సాయిరాంపై కేసు నమోదు చేసి మంగళవారం అచ్చంపేట పట్టణంలోని నిందితుడి ఇంటి వద్ద నిఘా ఏర్పాటు చేసి అరెస్టు చేశారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని ద్వితీయ శ్రేణి న్యాయస్థానంలో హాజరుపర్చారు. న్యాయమూర్తి సాయిరాం కేసు పూర్వపరాలు పరిశీలించి నిందితునికి వారం రోజులు జైలు శిక్ష విధించినట్లు ఏఎస్పీ రామేశ్వర్ తెలిపారు. ఇదే యువకునిపై గతంలోనూ ఈవ్ టీజింగ్ కేసు ఉందన్నారు. మహిళలను, అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

**నిందితుడిపై కేసు నమోదు.. బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే :** వివాహేతర సంబంధం విషయంలో కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితతో శివకు వివాహేతర సంబంధముంది. ఈ క్రమంలో ఆ మహిళ మగశిశువుకు జన్మనిచ్చింది. దానికి కారణం శివనేనని, కానీ తనకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాడని ఆగస్టులో ఠాణాలో ఫిర్యాదు చేశారు. మరోసారి ఈ నెల 21న జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో మంగళవారం శివపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

**లభించని వ్యక్తి ఆచూకీ.. లింగాల, న్యూస్‌టుడే :** మండలంలోని ఎర్రపెంట అడవిలో అదృశ్యమైన నిమ్మల శంకర్ ఆచూకీ 25 రోజులుగా లభించలేదు. వర్షంలోనే కుటుంబ సభ్యులు, ఫారెస్ట్ వాచర్లు ఎర్రపంట నుంచి సలేశ్వరం లొంక వరకు గాలిస్తున్నారు. మరోవైపు శంకర్ అదృశ్యంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అడవిలో అదృశ్యం అయిన వ్యక్తి తిండి లేకుండా ఇన్ని రోజులు ఎలా ఉంటాడని గిరిజనులు అంటున్నారు.

**ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు.. పెంట్లవెల్లి, న్యూస్‌టుడే :** బొలేరో వాహనాన్ని ఆటో ఢీకొని ముగ్గురికి స్వల్ప గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై రామన్‌గౌడ్ కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఫైబర్ కేబుల్ కూలీలు బొలెరో వాహనాన్ని పెంట్లవెల్లిలోని ఓ పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు పక్కన ఆపి ఉన్నారు. కొల్లాపూర్ వెళ్తున్న ఆటో అదుపుతప్పి బొలేరో వాహనాన్ని ఢీకొంది. పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటేష్‌తో పాటు అందులో ఉన్న వ్యక్తికి, బొలేరో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. ఫైబర్ కేబుల్ సివిల్ ఇంజినీర్ ఖాజామైనోద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**రాకొండలో పట్టపగలే ఇంట్లో చోరీ.. తెలకపల్లి, న్యూస్‌టుడే :** మండలంలోని రాకొండ గ్రామంలో పట్ట పగలే ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్, గ్రామస్థులు కథనం ప్రకారం.. అచ్చంపేట ప్రధాన రోడ్డు పక్కన కొత్తగా కట్టిన ఇంటి యజమాని మల్లయ్య, భార్య రజిత మధ్యాహ్నం 12.30 గంటల ప్రాంతంలో ఇంటికి తాళం వేసి కూరగాయల కొనుగోలుకు తెలకపల్లి వెళ్లారు. పని ముగించుకుని 1.30 గంటల ప్రాంతంలో తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపు తాళం విరగొట్టి ఉంది. ఇంట్లోని బీరువాను తెరిచి ఉంది. అందులోని రూ. 15వేలు నగదు, స్మార్టు ఫోన్, రూ. 30వేలు విలువైన బంగారు చెవి కమ్మలు, రెండు పట్టు చీరెలు చోరీ గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**ఇసుక ట్రాక్టర్ జప్తు.. కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే :** దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న గుండూరు గ్రామానికి చెందిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలో వాహనం పట్టుబడగా ఎలాంటి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని జప్తుచేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.